కుట్టుకార్మికుల పొట్టకొట్టిన సర్కారు

- వేలాది మందిని రోడ్డున పడేసింది
- డ్వాక్రాకు స్కూల్ యూనిఫామ్ పనులు
- ప్రభుత్వ స్కూల్ యూనిఫామ్ స్టిచ్చింగ్ కార్మికుల ఆందోళన

ఖైరతాబాద్, మే 21: కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత చర్యలతో రాష్ట్రంలోని వేలాది మంది కుట్టుపని కార్మికుల పొట్టలు కొట్టిందని ప్రభుత్వ స్కూల్ యూనిఫామ్ స్టిచ్చింగ్ కార్మికుల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని తెలిపారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మీడియా సమావేశంలో ప్రతినిధులు మాడిశెట్టి లక్ష్మీనారాయణ, వరలక్ష్మి తదితరులు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రెండు లక్షల మందికిపైగా ప్రభుత్వ స్కూల్ యూనిఫామ్ కుట్టుపనిపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. దశాబ్దాలుగా దర్జీ, టైలర్లకే ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల యూనిఫామ్స్ వర్క్ ఆర్డర్ ఇచ్చేవారని చెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే తమను కాదని, డ్వాక్రా గ్రూపులకు పనులను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం గడువు సమీపిస్తుండటంతో అదివికటించి యూనిఫామ్ కుట్టుపనులను అధికారులు కొన్ని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించినట్టు తమ దృష్టికి వచ్చిందని ఆరోపించారు. అనంతపురం, విజయవాడ, షోలాపూర్‌కు చెందిన ప్రైవేట్, కొన్ని కార్పొరేట్ ఏజెన్సీలకు డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు అప్పగించారని, కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శించారని, దీనిపై విచారణ జరిపించాలని కోరారు. ఆ ఏజెన్సీల వద్ద కూడా కుట్టు పని జాప్యం అవుతుండటంతో సంబంధిత అధికారులు తిరిగి పాత కార్మికులకు ఫోన్లు చేసి ఆర్డర్ ఇస్తామంటున్నారని చెప్పారు. ప్రస్తుతం జతకు రూ.50 మాత్రమే ఇస్తున్నారని, ఒకవేళ పనులు చేసినా ఆ ధరకు కుట్టుగూళ్లు గిట్టుబాటు కాదని చెప్పారు.

జీవనాధారం కోల్పోయిన కార్మిక కుటుంబాలు

పన్నెండు ఏండ్లపాటు మా జీవనాధారమైన ప్రభుత్వ స్కూల్ యూనిఫామ్స్ కుట్టుపనులు ఈ సారి లేక కుటుంబ జీవనం భారమైందని నల్లగొండ జిల్లాకు చెందిన పావని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తన భర్త ఫుడ్ డెలివరీ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని తెలిపారు. పదేండ్లపాటు ఉపాధి కల్పించిన యూనిఫామ్స్ కుట్టుపని ఈ ఏడాది లేక తన భర్త డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని హైదరాబాద్ చంపాపేటకు చెందిన జయంతి తెలిపారు. ఆ వచ్చే ఆదాయం సరిపోక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. వృత్తిపని కార్మికులకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఆదరణ ఉన్నదని, కాంగ్రెస్ హయాంలో పట్టింపే లేదని మీర్‌పేటకు చెందిన దొంతం వెంకట్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చుడుతోనే మా పొట్టలు కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

సోమాజిగూడలో న్యాయం చేయాలని నినాదాలు చేస్తున్న కుట్టుపని కార్మికులు

లోకం పోకడ



వీళ్లకు ఓటేస్తే ఇళ్లు కట్టిస్తారో, తెలియదు గానీ, వేయకుంటే మాత్రం వున్న ఇండ్లు కూల్చేటట్టున్నారు!

నల్లగొండలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ లింగయ్యయాదవ్, ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తదితరులు

సన్నాలకే బోనస్ అని సన్నాయి నొక్కులు

అరచేతిలో వైకుంఠం చూపి రేవంత్ మోసాలు

- గోల్డ్‌మెడలిస్ట్‌కు ఓటేద్దామా.. బ్లాక్‌మెయిలర్‌కా?
- పట్టభద్రులంతా ఆలోచించి రాకేశ్‌రెడ్డి ఓటేయాలి
- నల్లగొండ జిల్లాలో ఎమ్మెల్సీ సన్నాహక భేటీల్లో
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు

నల్లగొండ ప్రతినిధి, మే 21 (నమస్తే తెలంగాణ)/చందంపేట: రాష్ట్రంలో ఐదు నెలల పాలనలోనే కాంగ్రెస్ సర్కార్ ఐదేండ్ల అపఖ్యాతి మూటగట్టుకున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. 'ఎన్నికల ప్రచారంలో కాంగ్రెసోళ్లు కింటా వడ్లకు 500 బోనస్ ఇస్తామని చెప్పిండ్రు. ఇప్పుడేమో సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తమని చెప్తున్నరు. తెలంగాణలో 80-85 శాతం దొడ్డు వడ్లే పండిస్తరు. అలాంటి దొడ్లు వడ్లకు కాకుండా సన్నాలకే బోనస్ ఇస్తామంటూ సన్నాయి నొక్కులు నొకుతున్నది సన్నాసి కాంగ్రెస్ ప్రభుత్వం. ఇట్లాంటి సర్కార్‌కు బుద్ధిచెప్పాలంటే, రైతు బిడ్డల తరపున ప్రశ్నించే గొంతుక కావాలి. అట్లాంటి గొంతును శాసనమండలిలో వినిపించే రాకేశ్‌రెడ్డికే పట్టభద్రులు ఓటు వేయాలి' అని కేటీఆర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మద్దతుగా నల్లగొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ శ్రేణులు, పట్టభద్రులతో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశాల్లో కేటీఆర్ మాట్లాడారు. 'రెండు లక్షల ఉద్యోగాలన్నరు. మెగా డీఎస్సీ వేస్తమన్నరు. జాబు క్యాలెండర్ ప్రకటిస్తమన్నరు. ఇట్ల చెప్పిన వేటికీ నేటికీ అతీగతీ లేదు. ఇక పరీక్ష ఫీజులే ఉండవన్నరు. టెట్ పరీక్షకు ఫీజు అప్పుడు రూ.400 ఉంటే ఇప్పుడు ఐదు రెట్లు పెంచిండ్రు' అని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల్లో గెలిచే వరకు ఓ మాట.. గెలిచాక మరో మాటతో రేవంత్ సర్కార్ బోడి మల్లయ్య సామెతను తలపిస్తున్నదని మండిపడ్డారు.

బ్లాక్ మెయిలర్‌కు సపోర్టుచేస్తే మీకే ఎసరు..

పెద్దల సభగా పేరొందిన మండలి ఎన్నికల్లో ఓ చీటర్, బ్లాక్‌మెయిలర్‌కు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఎలా ఇచ్చిందని కేటీఆర్ ప్రశ్నించారు. దందాలు చేసి బెదిరించేవారిని గెలిపిస్తే సమాజానికి నష్టమని హెచ్చరించారు. మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కూడా పునరాలోచించాలని, ఇట్లాంటి చీటర్‌కు, బ్లాక్ మెయిలర్‌కు సపోర్టు చేస్తే మీకే ఎసరు పెట్టడం ఖాయమని హితవుపలికారు. పోటీలో ఉన్న అభ్యర్థుల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి కష్టపడి చదువుకొని గోల్డ్‌మెడల్ సాధించి, అమెరికాలో ఫేస్‌బుక్, సిటీ బ్యాంక్ వంటి ప్రఖ్యాత కంపెనీల్లో పనిచేస్తూ అక్కడే స్థిరపడే అవకాశం ఉన్నా.. పుట్టినగడ్డ తెలంగాణకు ఏదైనా చేయాలన్న తపనతో రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. రాకేశ్‌రెడ్డికి కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు పొంతనే లేదని చెప్పారు. పొద్దున లేస్తే నోటికి ఏదోస్తే అది, ఎంతోస్తే అంత బూతులు మాట్లాడుతూ 56 క్రిమినల్ కేసులతో 76 రోజులు జైలులో ఉన్న వ్యక్తి కాంగ్రెస్ అభ్యర్థి అని చెప్పారు. అందుకే పట్టభద్రులంతా ఆలోచించి ఓటేయాలని కోరారు. నిజాయితీపరుడైన రాకేశ్‌రెడ్డికి ఓటేస్తారా? యూట్యూబ్‌ని అడ్డం పెట్టుకొన్న బ్లాక్‌మెయిలర్, చీటర్‌గా పేరుబడ్డ కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేస్తారా? అనేది తేల్చుకోవాలని సూచించారు.

సాగర్‌ను కేఆర్ఎంబీకి అప్పగించిన కాంగ్రెస్

కేసీఆర్‌పై పదేండ్లు ఒత్తిడి తెచ్చినా అప్పగించలేదని, రేవంత్‌రెడ్డి వచ్చిన ఒక్క నెలలోనే నాగార్జున సాగర్ ప్రాజెక్టును కేఆర్ఎంబీకి అప్పగించాడని కేటీఆర్ విమర్శించారు. ఇటీవల 4.5 టీఎంసీల నీటిని సాగర్ నుంచి ఆంధ్రాకు తీసుకెళ్లినప్పటికీ బీఆర్ఎస్ అభ్యర్థి మల్లన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒక్కసారైనా ప్రశ్నించాడా అని నిలదీశారు. ఇప్పటికే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామంటున్న రేవంత్‌రెడ్డి.. ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకుండా రాత పరీక్ష పెట్టకుండా ఇంటర్వ్యూ చేయకుండానే ఎలా ఉద్యోగాలు ఇచ్చాడో పట్టభద్రులు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. అందుకే నిరుద్యోగులు, పట్టభద్రుల తరపున కొట్లాడేందుకు రాకేశ్‌రెడ్డికి ప్రథమ ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలోని 34 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా కలిసి కాచివడబోసి ఒక బ్లాక్ మెయిలర్‌కు టికెట్ ఇచ్చారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎద్దేవా చేశారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, విద్యావంతుల పక్షాన ప్రభుత్వంపై కొట్లాడే దమ్ము ధైర్యం తనకు ఉన్నాయని, అందుకే పట్టభద్రులు తనకు ఓటేసి గెలిపించాలని బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాకేశ్‌రెడ్డిని గెలిపిస్తే శాసనమండలిలో ప్రభుత్వంపై పోరాటం చేసి నిరుద్యోగులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో అడ్డగోలు హామీలు ఇచ్చి అబద్ధాలతో అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. సమావేశాల్లో జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్, తిప్పన విజయసింహారెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నేతలు కర్నె ప్రభాకర్, చెరుకు సుధాకర్, కంచర్ల కృష్ణారెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, ఒంటెద్దు నర్సింహారెడ్డి, నల్లమోతు సిద్ధార్థ, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి పాల్గొన్నారు.

రవీంద్రకుమార్‌కు మాజీ మంత్రి కేటీఆర్ పరామర్శ

బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తండ్రి కనిలాల్‌నాయక్ చిత్రపటానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. కనిలాల్ ఇటీవల మృతి చెందగా.. దేవరకొండలోని రవీంద్రకుమార్ ఇంటికి మంగళవారం కేటీఆర్ వెళ్లారు. రవీంద్రకుమార్‌ను పరామర్శించారు. పౌర సరఫరాలశాఖలో ఉద్యోగిగా పనిచేసి ఉద్యోగ విరమణ అనంతరం గ్రామానికి సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రజా జీవితంలోకి వచ్చిన కనిలాల్‌నాయక్.. ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నిక అయ్యారని గుర్తు చేశారు.

ఇది ప్రజాపాలన కాదు.. రైతు వ్యతిరేక పాలన

- కాంగ్రెస్ సర్కారుకు కౌంట్‌డౌన్ షురూ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదని, రైతు వ్యతిరేక పాలన అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. మంగళవారం ఎక్స్ వేదికగా స్పందించారు.

ఇది కపట కాంగ్రెస్ మార్కు.
మోసం.. దగా.. నయవంచన..

గ్యారెంటీ కార్డులో..
వరిపంటకు రూ.500 బోనస్ అని ప్రకటించి..
ఇప్పుడు 'సన్న వడ్లకు మాత్రమే' అని
సన్నాయి నొక్కులు నొక్కుతారా ??

ప్రచారంలో ప్రతి గింజకు అని ఊదరగొట్టి..
ప్రభుత్వంలోకి రాగానే చేతులెత్తేస్తారా ??
ఇది ప్రజా పాలన కాదు..
రైతు వ్యతిరేక పాలన

నిన్నటిదాకా సాగునీరు ఇవ్వక సావగొట్టారు..
కరెంట్ కోతలతో పంటలను ఎండగొట్టారు..
కష్టించి పండించిన ధాన్యాన్ని కొనకుండా
అకాల వర్షాలపాలు చేసి ఆగం చేశారు..

ప్రతి పటా రైతులు, కౌలు రైతులకు
రూ. 15 వేలు రైతుభరోసా అన్నారు.. ఇవ్వలేదు

వ్యవసాయ కూలీలకు
రూ. 12000 వేలు అన్నారు.. వేయలేదు

ప్రతి రైతుకు డిసెంబర్ 9నే..
రెండు లక్షల రుణమాఫీ అన్నారు.. చేయలేదు

నేడు బోనస్ విషయంలో కూడా
ప్రభుత్వ బోగస్ విధానాన్ని బయటపెట్టారు.

ఓట్ల నాడు ఒకమాట...
నాట్ల నాడు మరోమాట చెప్పడమే కాంగ్రెస్ నైజం
అసెంబ్లీ ఎన్నికల్లో గాలిమాటలతో
గారడీ చేసింది.. కాంగ్రెస్ పార్టీ

పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు డబ్బా లో పడగానే..
నాలుగు కోట్ల ప్రజల సాక్షిగా తన నిజస్వరూపాన్ని
బయటపెట్టింది.. కాంగ్రెస్ సర్కారు

ఎద్దేడ్చిన ఎవుసం..
రైతేడ్చిన రాజ్యం నిలబడదు..

నమ్మి ఓటేసినందుకు.. రైతుల గొంతు కోసిన
కాంగ్రెస్ సర్కారును అన్నదాతలు ఇక వదిలిపెట్టరు..

పల్లె పల్లెనా ప్రశ్నిస్తారు..
తెలంగాణవ్యాప్తంగా నిలదీస్తారు..
కపట కాంగ్రెస్‌పై సమరశంఖం పూరిస్తారు..

నేటి నుంచి రైతన్నల చేతిలోనే..
కాంగ్రెస్ సర్కారుకు కౌంట్ డౌన్ షురూ

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	42.2°c	27.7°c
నల్లగొండ	42.1°c	31.9°c
రంగారెడ్డి	40.5°c	22.1°c
మెదక్	40.2°c	23.6°c
మహబూబ్‌నగర్	40.1°c	28.3°c
కరీంనగర్	39.0°c	28.0°c
నిజామాబాద్	38.8°c	28.5°c
ఖమ్మం	38.0°c	27.0°c
వరంగల్	38.0°c	27.0°c
హైదరాబాద్	36.4°c	25.6°c

బంగాళాఖాతంలో నేడు అల్పపీడనం

- మరో ఐదు రోజులు మోస్తరు వర్షాలు
- 24న వాయుగుండంగా మారే అవకాశం
- జూన్ రెండో వారానికి రాష్ట్రంలోకి రుతుపవనాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): రానున్న ఐదురోజులు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ కోస్తా, తమిళనాడు మీదుగా ఉపరితల ఆవర్తనం కర్ణాటక అంతర్భాగం వరకు సముద్ర మట్టానికి 0.9కి.మీ ఎత్తులో కొనసాగుతుందని, ఎత్తుకు పోయేకొద్ది స్వల్పంగా నైరుతి వైపు వంగి ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో బుధ, గురువారాల్లో వానలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. బంగాళాఖాతంలో అల్పపీడనంగా మారి 24నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నెల చివరి వరకు తుఫాన్‌గా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నందున మరికొన్ని ప్రాంతాలకూ విస్తరించే అవకాశం ఉందని తుఫాను హెచ్చరికల కేంద్ర అధికారి సునంద వెల్లడించారు. కాగా, ఒడిశా, పశ్చిమబెంగాల్ మధ్య తుఫాన్ తీరం దాటుతుందని వాతావరణ శాఖ తెలిపింది. పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఏపీలను జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అలర్ట్ చేసింది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో మరో రెండు రోజులు ఉత్తరాంధ్ర, రాయలసీమతో పాటు ఏలూరు జిల్లాలో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ చెప్పుకొచ్చింది.

జూన్ రెండోవారంలో రుతుపవనాల విస్తరణ

నైరుతి రుతుపవనాలు వచ్చే నెల 5 నుంచి 11వ తేదీల మధ్య రాష్ట్రాన్ని తాకనున్నట్టు అంచనా వేసింది. ఈ ఏడాది నైరుతి గమనం సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరుకు రుతుపవనాలు కేరళను తాకనున్నాయి. అక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ మీదుగా తెలంగాణకు చేరుకుంటాయి. ఇందుకు కనీసం అయిదారు రోజుల సమయం పడుతుంది. ఆ ప్రకారంగా చూస్తే జూన్ 5 నుంచి 8 తేదీల మధ్య రుతుపవనాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాతావరణ కేంద్రం అంచనా వేస్తుంది. జూన్ రెండో వారంలో రాష్ట్ర మంతటా విస్తరిస్తాయని వాతావరణశాఖ నిపుణులు సూచిస్తున్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాకే ఎన్నికలు జరపాలి

- రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): బీసీ రిజర్వేషన్లను పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆర్ కృష్ణయ్య నేతృత్వంలోని బీసీ నేతలు మంగళవారం సచివాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కతో భేటీ అయ్యారు. ప్రభుత్వం జూన్ నెలాఖరులో స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని ప్రకటించిందని గుర్తు చేశారు. కులగణన చేసిన తర్వాత దాని ఆధారంగా బీసీ రిజర్వేషన్లను పెంచాల్సి ఉంటుందని, దీనికే రెండు నెలల గడువు పడుతుందని తెలిపారు. ఈ ప్రక్రియను ఇంకా ప్రారంభించనేలేదని, రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా జరుపుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకారం బీసీ రిజర్వేషన్ల సంఖ్యను 20 శాతం నుంచి 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో చట్టం చేసి బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచవచ్చని సూచించారు. అవసరమైతే అన్ని పార్టీలు సహకరించడానికి సిద్ధంగా ఉన్నాయని తేల్చి చెప్పారు. కులాల వారి లెక్కలు సేకరించిన తర్వాత విద్యా, ఉద్యోగాల రిజర్వేషన్లను 29 శాతం నుంచి జనాభా ప్రకారం 50 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అంటున్నారని గుర్తు చేశారు. విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రీమీలేయర్ తొలగించాలని కోరారు. ప్రతి కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్న హామీ మేరకు మరో 40 కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న 11 ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చాలని కోరారు. తమ డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించారని బీసీ నేతలు తెలిపారు. ఈ భేటీలో సంఘం నేతలు గుజ్జ కృష్ణ, నీలం వెంకటేశ్, అంజి, బాలస్వామి, వెంకటేశ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విషయాన్ని వెల్లడిస్తున్న కేదార్‌నాథ్ యాత్రలో ఉన్న న్యాయవాదులు

న్యాయవాదులకే నకిలీ హెలికాప్టర్ టికెట్లు!

- బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు

అలంపూర్, మే 21 : సైబర్ నేరగాళ్లు హెలికాప్టర్ నకిలీ టికెట్లు విక్రయించి న్యాయవాదులనే బురిడీ కొట్టించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన 11 మంది న్యాయవాదులు ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ యాత్రకు బయలుదేరారు. ప్రధాన ఆలయాన్ని చేరుకోవడానికి 22 కిలోమీటర్ల మేర దట్టమైన అడవుల్లో కాలినడకన వెళ్లాల్సి ఉంటుంది. లేదా హెలికాప్టర్ ద్వారా చేరుకోవచ్చు. హెలికాప్టర్ ప్రయాణానికి ఒక్కొక్కరు దాదాపుగా రూ.5,500 నుంచి రూ.6 వేలు వెచ్చించి ఆన్‌లైన్‌లోని ఓ వెబ్‌సైట్‌లో టికెట్లు కొనుగోలు చేశారు. ఏవియేషన్ సంస్థ నిర్వహించే హెలికాప్టర్ సర్వీసుల వద్దకు వారు మంగళవారం చేరుకున్నారు. హెలికాప్టర్ ఎక్కేందుకు గాను కొనుగోలు చేసిన టికెట్లు చూపించగా అవి నకిలీవని తేలింది. దీంతో న్యాయవాదులు కంగుతిన్నారు. నకిలీ వెబ్‌సైట్ నిర్వాహకుల గురించి ఆరా తీసే ప్రయత్నం చేసినా ఫలించలేదు.ఇలా వారు మాత్రమే కాదు వందలాది మంది యాత్రికులు నష్టపోయినట్టు తెలిసింది. ఈ విషయాన్ని న్యాయవాదులు సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా వైరల్‌గా మారింది. యాత్రకు వెళ్లిన వారిలో అలంపూర్ ప్రాంతానికి చెందిన న్యాయవాదులు గవ్వల శ్రీనివాసులు, నాగరాజు యాదవ్ తదితరులు ఉన్నారు.

అమెజాన్‌లో 3.2 కోట్లు 'సెటిల్' చేశాడు!

- మాజీ ఫైనాన్షియల్ ఆపరేషనల్ అనలిస్ట్ చేతివాటం

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 21 (నమస్తే తెలంగాణ): సంస్థలో నుంచి వెళ్లిన మాజీ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు రూ. 3.2 కోట్లు సెటిల్‌మెంట్ పేరుతో పక్కదారి పట్టించిన అమెజాన్ డెవలప్‌మెంట్ సెంటర్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మాజీ ఫైనాన్సియల్ ఆపరేషనల్ అనలిస్ట్‌ను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం అరెస్ట్ చేసింది. ఈవోడబ్ల్యూ డీసీపీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్‌నగర్‌కు చెందిన మెట్టు వెంకటేశ్వర్లు అమెజాన్‌లో 2015 జూలైలో ఫైనాన్సియల్ ఆపరేషన్ అనలిస్ట్‌గా చేరాడు. ఉద్యోగుల జీతభత్యాల వ్యవహారాలన్నీ సెటిల్ చేసేవాడు. సంస్థలో మానేసిన ఉద్యోగులు, యాక్టివ్‌గా లేని ఉద్యోగుల పెండింగ్ సెటిల్‌మెంట్ల ఫైల్స్ బయటకు తీశాడు. కొందరు మాజీ ఉద్యోగులతో చేతులు కలిపి, వాళ్లు తమ బకాయిలు సెటిల్ చేయమన్నట్టుగా నకిలీ మెయిల్స్ చేసేవాడు. పాత ఉద్యోగి బ్యాంకు ఖాతా మారినట్టు, కొత్త ఖాతాలోకి బకాయిలు డిపాజిట్ చేయాలని మెయిల్స్ పంపించేవాడు. మెయిల్ రిక్వెస్ట్‌ను అప్రూవల్ చేసి ఆయా ఖాతాల్లో డిపాజిట్లు చేయించాడు. ఇలా 184 మంది ఉద్యోగుల బకాయిలు 50 ఖాతాల్లోకి బదిలీ చేయించాడు. ఆ ఖాతాలన్నీ తన స్నేహితులు, బంధువులవే కావడం గమనార్హం. ఇలా 2016 నుంచి 2023 వరకు రూ.3.2 కోట్లు పక్కదారి పట్టించాడు. కంపెనీ అంతర్గత అడిట్‌లో ఈ విషయం వెలుగులోకి రావడంతో వెంకటేశ్వర్‌రావు ఉద్యోగానికి రాజీనామా చేశాడు. ఆడిటింగ్‌లో నిధుల దుర్వినియోగం వెలుగులోకి రావడంతో తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సంస్థ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రతినిధి అంకుర్ శర్మ సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీపీ హుస్సేనీనాయుడు నేతృత్వంలోని బృందం కేసు నమోదు చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసింది.

ఏసీపీ అక్రమాస్తులు 3.5కోట్లు

- ఉమామహేశ్వర్‌రావు, బంధువులు, స్నేహితుల ఇండ్లలో ఏసీబీ దాడులు
- ఏకకాలంలో 13చోట్ల సోదాలు
- భారీ ఎత్తున సొత్తు స్వాధీనం
- సాహితీ ఇన్‌ఫ్రా కేసు దర్యాప్తులో డబ్బుల డిమాండ్‌పై ఆరోపణలు
- గతంలో రెండు సార్లు సస్పెన్షన్
- డిపార్ట్‌మెంట్‌లో వివాదాస్పదుడిగా పేరు

ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు ఇంట్లో స్వాధీనం చేసుకున్న సొత్తు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 21 (నమస్తే తెలంగాణ): ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నాడని వచ్చిన ఫిర్యాదుపై సీసీఎస్‌లో పనిచేస్తున్న ఏసీపీ ఉమామహేశ్వర్‌రావుతో పాటు ఆయన బంధువులు, స్నేహితుల ఇండ్లు మొత్తంగా 13చోట్ల ఏకకాలంలో ఏసీబీ అధికారులు మంగళవారం దాడులు చేశారు. సోదాల్లో రూ.3.5కోట్ల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్లో విలువ ఇంకా ఎక్కువ ఉంటుందని అధికారులు తెలిపారు. సాహితీ ఇన్‌ఫ్రా కేసు దర్యాప్తు బాధ్యతను ఉమామహేశ్వరావు చూస్తున్నారు. బాధితుల వద్ద డబ్బులు డిమాండ్ చేశారని, నిందితులతో కలిసిపోయారని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే సోదాలు చేసినట్టు ఏసీబీ అధికారులు తెలిపారు.

ఆది నుంచీ వివాదాస్పదుడే..

1995 బ్యాచ్‌కు చెందిన ఉమామహేశ్వర్‌రావు ఆబిడ్స్, జవహర్‌నగర్ ఠాణాల్లో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న స